# అభివృద్ధిని వివరిస్తూ... ఆప్యాయంగా పలకరిస్తూ..

- బీఆర్ఎస్ అభ్యర్థుల పాదయాత్రకు నీరాజనం
- పండగ వాతావరణంలో ఎన్నికల ప్రచారం
- బతుకమ్మ, డప్పు చప్పుళ్లు, పూలవర్షం కురిపిస్తూ అభ్యర్థులకు సాదర స్వాగతం

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ ) : ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థుల దూకుడు కొనసాగుతున్నది. నియోజకవర్గంలో డివిజన్‌ల వారీగా ప్రచారాన్ని ఉధృతం చేశారు. గడిచిన రెండు నెలలుగా నియోజకవర్గంలోనే ప్రజలతో మమేకమై అలుపెరగకుండా అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. అభ్యర్థులకు అడగడుగునా డప్పు చప్పుళ్లు, బతుకమ్మ ఆటలు, పూలవర్షంతో సాదరస్వాగతం పలుకుతున్నారు. మహిళలు మంగళహారతులు పట్టి, నుదుటన కుంకుమ తిలకం దిద్ది శాలువాలు, పూలమాలలతో ఘనస్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుతున్నారు. అభ్యర్థులు కూడా పదేండ్లలో జరిగిన అభివృద్ధి కళ్ల ఎదుటే ఉన్నాయని, మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగేందుకు మీ బిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. ప్రచారంలో ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానులు, ప్రేమను ఎన్నటికీ మరువలేమని అభ్యర్థులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ప్రచారంలో దూసుకువెళ్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పడుతున్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ.. ఓటు అభ్యర్థిస్తూ ముందుకు వెళ్తున్న అభ్యర్థులకు వాడవాడలా, కాలనీలు బ్రహ్మరథం పడుతున్నారు. స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల ఆధారంగానే ప్రచారం చేయాలన్న గులాబీ బాస్ కేసీఆర్ ఆదేశాల ప్రకారం అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే అస్త్రాలుగా సాగుతూ లబ్ధిదారులు, వారి కుటుంబాలతో పాటు ప్రజల నుంచి ఆశీర్వాదం పొందుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు 65 ఏండ్లు పాలించిన అభివృద్ధి జరుగలేదని, గడిచిన పదేండ్లలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం వందేండ్ల అభివృద్ధికి బాటలు వేసిందంటూ ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందున్న బీఆర్ఎస్ ప్రత్యర్థి పార్టీల డిపాజిట్లను గల్లంతు చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పావులు కదుపుతున్నారు. కలిసి వచ్చే ఇతర పార్టీల నేతలకు గులాబీ కండువాలు కప్పుతూ నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతూ ప్రతిపక్ష పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. వాడలు, బస్తీలు, కాలనీలను చుట్టేసి అన్ని వర్గాల మద్దతును కూడగడుతూ ప్రత్యర్థులకు వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు. దాదాపు రెండు నెలల గులాబీ శ్రేణుల ప్రచార శైలితో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



## మా సాయన్న బిడ్డవు.. తప్పకుండా గెలుస్తావు

కంటోన్మెంట్, అక్టోబర్ 20 : నాలుగో వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా పికెట్ రాంనగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత పాదయాత్ర నిర్వహిస్తున్నారు. దివంగత సాయన్న స్నేహితుడు నర్సింగ్‌రావు ఇంటి సమీపంలోకి పాదయాత్రగా వస్తున్న లాస్యనందితకు మద్దతు తెలిపేందుకు బయటకు వచ్చే ప్రయత్నంలో కిందపడిపోయాడు. నర్సింగ్‌రావు ఇంటికి చేరుకున్న లాస్యనందిత నర్సింగ్‌రావును చూసి కంటతడి పెట్టుకున్నారు. ఆపరేషన్‌కు కావాల్సిన నిధులను సీఎంఆర్ఎఫ్ నుంచి వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ పెద్దాయన మాట్లాడుతూ మా సాయన్న కూతురువు.. తప్పకుండా ఎన్నికల్లో గెలుపు నీదే అంటూ.. ఆశీర్వదించారు.



# మీ సేవకున్ని.. ఆశీర్వదించండి

- ముఖ్యమంత్రి కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడతా
- అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తా
- మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

**నేను నాయకున్ని కాదు.. సేవకున్ని. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చూసి స్ఫూర్తి పొంది తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాను. ముఖ్యమంత్రి కేసీఆర్ నా మీద నమ్మకంతో మల్కాజిగిరి అసెంబ్లీ టికెట్ ఇచ్చారు. మల్కాజిగిరి ప్రజలకు ఆరాచక శక్తుల నుంచి విముక్తి కల్పించి ప్రజల మధ్య సామరస్యమైన వాతావరణాన్ని కల్పిస్తానంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డితో నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ.. వివరాలన్నీ ఆయన మాటల్లోనే...** - మల్కాజిగిరి, అక్టోబర్ 20

మల్కాజిగిరి ప్రజల వద్దకు వెళ్లి పలుకరిస్తే అనూహ్య స్పందని వచ్చింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయి. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు వచ్చే ప్రభుత్వంలో మరింత పెరుగనున్నాయి. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తామని సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో పెట్టడంతో ప్రజలకు ఆనందం కలిగింది.

**భూ సమస్యను పరిష్కరిస్తాం**

మల్కాజిగిరి సర్కిల్ సర్వే నంబర్ 278లో 22 కాలనీలలో దాదాపు 80 వేల మంది నివసిస్తున్నారు. మూడు దశాబ్దాలుగా వారికి భూమి హక్కులు లేవు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందించి గజానికి రూ.250తో రెగ్యులరైజేషన్ చేసుకోవచ్చని జీవోను ఇచ్చారు. 80 వేల మందికి ఊరట రావడం నాకు తృప్తినిచ్చింది. రానున్న రోజుల్లో మీతోఉండి భూ సమస్యలను పరిష్కరిస్తాను.



ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి బీ ఫామ్ అందుకుంటున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

**రూ.10కోట్లతో వాటర్ రిజర్వాయర్..**

గౌతంనగర్, వినాయక్‌నగర్, మల్కాజిగిరిలో కొంత భాగంలో నివస్తున్న వారికి పుష్కలంగా నీటి సరఫరా జరుగుతున్నా.. గుట్టలపై ఉన్న ఇండ్లకు నీటి సరఫరా సరిగా లేక ఇబ్బంది పడుతున్నారు. వీరి కోసం గౌతంనగర్ డివిజన్‌లో రూ.10కోట్లతో వాటర్ రిజర్వాయర్ కట్టించి ప్రజల దాహార్తిని తీరుస్తాం.

**రైల్వే చక్రబంధాల నుంచి విముక్తి**

మల్కాజిగిరి, అల్వాల్ సర్కిల్‌ల పరిధిలోని వాజ్‌పేయినగర్, గౌతంనగర్, వినాయక్‌నగర్, బొల్లారంలో ఉన్న రైల్వే గేట్ల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వాజ్‌పేయినగర్ రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మిస్తామని చెప్పినా ఆగిపోయింది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రైల్వే చక్రబంధాల నుంచి ప్రజలకు విముక్తి కలిగిస్తా.

**అరాచక శక్తులపై ఉక్కుపాదం**

మల్కాజిగిరిలో పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎవరిని అడిగా ఒకటే మాట. మాపై దౌర్జన్యం చేస్తున్నారని కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు చెప్పారు. సీఎం కేసీఆర్ ఆరాచక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఆరాచక శక్తులను ఓడించేందుకు ఓటు హక్కును వినియోగించాలి.

**మ్యానిఫెస్టోకు మంచి స్పందన**

బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోకు మంచి స్పందిన వచ్చింది. సన్న బియం, కుటుంబ బీమా, రూ.400లకు గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీలో రూ.15లక్షలకు పెంపుదల వంటి సంక్షేమ పథకాలు ప్రజలు నుంచి మంచి స్పందన వచ్చింది. అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారు.

**సీఎం కేసీఆర్ నమ్మకాన్ని వమ్ముచేయను**

బీఆర్ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ నాకు టికెట్ ఇవ్వడంతో ఆనందంగా ఉంది. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయను. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి మల్కాజిగిరి సీటును సీఎంకు బహుమతిగా ఇస్తాను.



అల్వాల్‌లో ఆత్మీయ సమ్మేళనంలో ప్రజలకు అభివాదం చేస్తున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి



ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు

## అభివృద్ధికి పట్టం కట్టండి

**ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్**

ముషీరాబాద్, అక్టోబర్ 20 : తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ మూడవ సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ధీమా వ్యక్తం చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో గత ఐదేళ్లలో చేపట్టిన ఘననీయమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తన గెలుపునకు దోహదపడుతాయని అన్నారు. శుక్రవారం అడిక్‌మెట్ డివిజన్ నాగమయ్యకుంట బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా నేత అనూష ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన అంజమ్మ, లక్ష్మి, మంజుల, రేణుకతో పాటు 40మంది మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించామని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, బి.శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, హరీశ్, జ్ఞాని, మాధవ్, రవి, సత్యనారాయణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓటేద్దాం

**చందానగర్‌లో ఎమ్మెల్యే గాంధీ సతీమణి ప్రచారం**



చందానగర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న శ్యామల దేవి, కార్పొరేటర్ మంజులరెడ్డి

కొండాపూర్, అక్టోబర్ 20 : నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఓటు వేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సతీమణి అన్నారు. శుక్రవారం ఆమె చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డితో కలిసి చందానగర్‌లోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి, ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గత 10 సంవత్సరాలుగా కృషి చేస్తున్నారన్నారు. మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తూ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలబెడుతారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో తెలంగాణలో ఎక్కడా లేని విధంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ సంతోషంగా ఉంటున్నారని, అందరికీ అన్ని విధాల అందుబాటులో ఉంటూ ముందుకు సాగే నాయకుడు అరికెపూడి గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్ల ధనలక్ష్మి, వరలక్ష్మి, చంద్రిక ప్రసాద్, మాధవి, పృధ్వి, రాధిక, ప్రణీత, భవాని, కుమార్, సునీత, మీనా, హరిత, పార్వతి, రాజేశ్వరి, యుగంధర్, రజిని, శ్యామలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలతో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, అక్టోబర్ 20 : కాంగ్రెస్‌పార్టీకి మద్దతు ఇస్తే మరో యాభై ఏండ్లు వెనక్కి వెళ్తారనే విషయాన్ని మైనార్టీలు గుర్తించారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన సీనియర్ నేత జావెద్ ఆధ్వర్యంలో సుమారు 50మందికిపైగా ఎంఐఎం కార్యకర్తలు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తమ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే మాగంటి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన సయ్యద్ నజీర్, ఉమర్, ముదస్సర్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.